జయజయ శంకర


హరహర శంకర




సంపుటి : 2 సంచిక : 5&6

# శ్రీ కామకోటి వాణి

శ్రీ శోభకృత్ మార్గశిర & పుష్య మాసం డిసెంబర్ 23 - జనవరి 2024



శ్రీ కంచికామకోటి పీఠం, కాంచీపురము



# 'అయోధ్య రామమందిర నిర్మాణంలో కంచి శంకరాచార్యుల మహత్వపూర్వకమైన కృషి'





జనవరి 22వ తేదీ 2024 భారతీయులందరికీ గొప్ప సుదినం. కోట్లాది భారతీయులు అత్యంత ఆనందంగా అయోధ్యలోని రాములవారి ప్రతిష్ఠ కార్యక్రమం తిలకించారు. ఈ అయోధ్య రామమందిరం నిర్మాణానికి కంచి కామకోటి పీఠం శంకరాచార్యుల నిరంతర కృషి చారిత్రాత్మకమైనది. 1986 – 2004 మధ్యలో శ్రీ జయేంద్రసరస్వతీ స్వామివారు నాలుగుసార్లు అయోధ్య వెళ్ళి రాములవారికి షోడశోపచార పూజలు నిర్వహించారు. వాల్మీకి రామాయణము, తులసీరామాయణము పారాయణ చేయించారు. మరుగున పడిన రాములవారి కులదేవత దేవకాళి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆ సమయంలో శ్రీజయేంద్రులవారు ఎంతో మతసామరస్యంతో ఈ విషయం పరిష్కారానికి ముస్లిం మతపెద్దలతో చర్చించారు. 'మీరు అయోధ్యలోని ఉన్న ఇతర మసీదులలో ప్రార్థనలు చేసుకోవచ్చని, మీకు మీరుగా ఈ రామజన్మభూమి ప్రాంతాన్ని ఇవ్వడం వల్ల మీకు మంచిపేరు లభిస్తుందని' వాళ్ళని ఒప్పించగలిగారు. కాని వాళ్ళలోని అపనమ్మకం వల్ల (ఇతర ప్రాంతాలలో కూడా ఇదే పరిస్థితి వస్తుందనే) ఈ విషయం కార్యరూపం దాల్చలేదు. అయితే ఒక సామరస్యం ఏర్పడింది. హింసాత్మకమైన సంఘటనలు ఆగాయి.

2006వ సంవత్సరంలో శ్రీ జయేంద్రస్వామివారు అయోధ్యలో రామజన్మభూమికి దగ్గరగా ఒక ఎకరం భూమిని తీసుకొని శంకరమఠం నిర్మించి అక్కడ కామాక్షీ అమ్మవారు, రాములవారు, శంకరాచార్యులవారి మందిరాలను నిర్మించారు. అక్కడ శంకరమఠంలో రెండు మహత్తరమైన కార్యక్రమాలు జరుగుతున్నాయి. మొదటిది శుక్లయజుర్వేద వేదపాఠశాలను ప్రారంభించారు. ఇప్పటికి 60 నుండి 70 మంది వేదవిద్యార్థులు అక్కడ శిక్షణ పూర్తిచేసుకున్నారు. రెండవది టైలరింగ్ మరియు కంప్యూటర్ ట్రైనింగ్ క్లాసెస్ పెట్టించారు. ఇప్పటికి దాదాపుగా 2000మంది స్త్రీలు (ముస్లిం యువతులతో సహా) ఇక్కడ శిక్షణ తీసుకొని స్వయం ఉపాధి పొందారు. దీనితో ప్రాంతీయంగా ఒక ప్రశాంత వాతావరణం ఏర్పడింది.

2020 ఆగస్ట్ 5వ తారీకు శ్రీ జయేంద్రులవారి జయంతి రోజున అయోధ్య రామమందిరానికి భూమి పూజ జరిగింది. ఆ ముహూర్తానికి









శ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామివారు కాంస్యఫలకం, రెండు ఇటుకలు, ఐదు బంగారు కాయిన్స్ జయ, నంద, భద్ర, పూర్ణ, ధిక్త అని వాస్తు కొరకు పెట్టబడేవి, అయుతచండి జరిగిన జలంతో అభిషేకం చేసి, శంఖుపాణివినాయకుడి దగ్గర పూజ చేయించి, నవరత్నాల వేసిన శంఖమును, కామాక్షీ అమ్మవారి ఆలయం, ఏకామ్రనాథస్వామి ఆమ్రవృక్షం, శ్రీమఠంలోని వకుళవృక్షం దగ్గర నుండి సేకరించిన మట్టిని భూమిపూజకు పంపించారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే అయోధ్య రామజన్మభూమి ట్రస్ట్‌వారు శంకుస్థాపనకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నప్పటికీ పూజకు అవసరమైనవి ఈ వస్తువులు ఏమి వారి దగ్గర లేవు. అప్పుడు న్యాస్ చైర్మన్ గోపాల్‌దాస్‌గారు 'వారు ఎంత దూరంలో ఉన్నా ఇక్కడికి అవసరమైనవి అన్నీ వారికి తెలుసు' అని వ్యాఖ్యానించారు. స్వామివారు పంపిన ఈ వస్తువులతోనే భూమిపూజ జరిగింది.

లలితోపాఖ్యానంలోని 39, 40 అధ్యాయాలలో సంతానం కోసం పరితపిస్తున్న దశరథమహారాజుకు అమ్మవారు కలలో దర్శనమిచ్చి కామకోష్ఠం వెళ్ళి కామాక్షీ అమ్మవారి దర్శనం చేసుకోమని చెప్పినట్టు శ్లోకాలు ఉన్నాయి. 12వేల మైళ్ళు ప్రయాణం చేసి దశరథులవారు అయోధ్య నుంచి కంచి చేరుకుని కామాక్షీ అమ్మవారిని స్తుతించారు. ఆ సంధర్భంలోనిదే దశరథ మహారాజ కృత కామాక్షి స్తోత్రం. దశరథుని భక్తికి మెచ్చి, అమ్మవారు దర్శనమిచ్చి 'చత్వారంతే జనుష్యంతి మదంశాః అంటూ, నలుగురు కుమారులు, నా అంశతో కలుగుతారు'


అని ఆశీర్వదించింది. అలా అమ్మవారి అనుగ్రహంతో రామలక్ష్మణ భరత శతృఘ్నులు కలిగారు. ఈ విధంగా ఉత్తరాన ఉన్న అయోధ్యకు, దక్షిణాన మరొక చివరనున్న కంచికి మధ్య రాములవారి ఆవిర్భావానికి ఒక బీజం ఉంది. అందుకొరకే శ్రీవిజయేంద్ర స్వామివారు అయోధ్యలోని భూమిపూజకు కంచి నుండి మట్టిని పంపించారు.



2023వ సంవత్సరం విజయేంద్రస్వామివారు కాశీలో చాతుర్మాస్యంలో ఉన్నప్పుడు రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ అధికారులు స్వామివారిని దర్శించుకుని రాములవారి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమం ఎలా చేయాలో ఆదేశించమని ప్రార్థించారు. స్వామివారు చెప్పినవన్నీ సక్రమంగా వ్రాసుకొన్నారు. యాగశాలకు ఏర్పాటుకు భూమిని కూడా కంచిమఠం నుండి పంపిన పండితులు నిర్ణయం చేశారు. చేయవలసిన హోమాలు, ఏ ఋత్విక్కుల చేత చేయించాలి అనే ముఖ్యవిషయాలు స్వామివారే నిర్ణయించి, గణేశ్వరశాస్త్రిద్రావిడ్‌గారు, లక్ష్మీకాంత్‌దీక్షిత్‌గార్ల ఆధ్వర్యంలో జరగాలని చెప్పారు. 2023 అక్టోబర్‌లో దసరా నవరాత్రుల ముందు అయోధ్య చేరుకున్నప్పుడు మహాలయపక్షాలలో శస్త్రహతచతుర్దశి నాడు శ్రీస్వామివారు రామజన్మభూమి ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన వారి కొరకు సరయూనది ఒడ్డున 1000వేల దీపాలు పెట్టాలని నిర్ణయించి స్వయంగా వారే మొదటి దీపం వెలిగించారు. సాక్షాత్తు శంకరాచార్యులవారు ఈ విధంగా చేయడం రామభక్తుల ప్రాణత్యాగం మరువలేనిదనడానికి నిదర్శనం.

నవరాత్రుల పూర్తి అయ్యాక ఏకాదశి నాడు రాములవారి అర్చన పూజలు చేశారు. గర్భగుడిలోకి వెళ్ళి అష్టదిక్కులు, ద్వాదశరాశులు, 27నక్షత్రాలను పూజించి, వాస్తు, ముహూర్త, చైతన్య పరంగా పూర్తి అనుకూలంగా ప్రతిష్ఠ జరగడానికి దేవతలను ప్రార్థించారు.

జనవరి 21వ తేదీ రామప్రతిష్ఠకు ఒకరోజు ముందు శ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామివారు హైదరాబాద్ స్కందగిరి శ్రీమఠం శిబిరంలో ఉదయం 3.30 గం॥లకు మహాత్రిపుర సుందరీ సమేత చంద్రమౌళీశ్వరుని అభిషేకం, త్రికాల పూజలు ముగించుకొని 7.30ని॥ బయలుదేరి అయోధ్య చేరుకున్నారు. ముందుగా శ్రీ స్వామివారు నేరుగా శ్రీరాముని కులదేవత అయిన దేవకాళి మందిరాన్ని సందర్శించి పూజలు నిర్వహించి, అనంతరం శంకర మఠాన్ని చేరుకున్నారు. అక్కడ ఆయనకు భయ్యా జోషి ఆహ్వానం పలికారు. అక్కడ రామ షడాక్షరి హోమాలు జరిగిన రామ సన్నిధిలో ఆయన కలశాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం శ్రీ విజయేంద్ర స్వామివారు అయోధ్య శంకర మఠం వెబ్‌సైట్ డబ్లు.డబ్ల్యు.డబ్ల్యు.కంచిమఠ్‌అయోధ్య.ఇన్‌ను ప్రారంభించారు.



రామజన్మభూమికి చేరుకున్న స్వామివారికి రామజన్మభూమి తీర్థక్షేత్ర






ట్రస్ట్ కోశాధికారి శ్రీ గోవింద్ దేవ్ జీ మహారాజ్, శ్రీ జ్ఞానేశ్వర్ ద్రావిడ్, శ్రీ లక్ష్మీకాంత్ దీక్షిత్, ఇతర వైదిక పండితులతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. యజ్ఞశాలలో కలయదిరిగిన స్వామివారు ప్రధాన కలశానికి, అష్టదిక్పాలక కలశాలు, ఉపకలశాలకు మంత్రోచ్చారణలతో పూలను సమర్పించారు. శ్రీరామునిపై ప్రత్యేక మంత్రాలతో కలశపూజ పూర్తి చేశారు. అక్కడ నుండి పూజశ్రీ స్వామివారు మహామంటపం, అర్ధ మంటపం సందర్శించి, తర్వాత గర్భగృహానికి వెళ్లారు. స్వామివారికి ట్రస్టు కోశాధికారి గోవింద్ దేవ్ గిరీజీ మఎహారాజ్, కార్యదర్శి చంపత్‌రాయ్ ఆహ్వానం పలికారు.

గర్భాలయంలో బాలరాముడి విగ్రహానికి నేత్రోన్మీలనం స్వామివారి సమక్షంలో జరిగింది. లలాటం నుంచి పాదాల వరకు బీజాక్షరాలతో, మంత్రాలతో, శ్లోకాలతో పురుషసూక్త విధానంతో, అంగన్యాస, కరన్యాసాలతో స్వామివారి చేతులమీదుగా రాములవారి విగ్రహానికి శక్తి వినివేశం జరిగింది. శ్రీరామ యంత్రం విగ్రహం క్రింద పెట్టారు. (విగ్రహం కింద మొత్తం మూడు శ్రీరామ యంత్రాలు పెట్టారు. ట్రస్ట్‌వాళ్ళు ఒక యంత్రం, తెనాలి నుండి ఒక రామభక్తుడు 6కోట్ల రామజపం చేసి తెచ్చిన యంత్రం, మరొకటి స్వామివారు మఠం



నుండి తీసికెళ్ళినది.) విగ్రహానికి బాలక్‌రామ్ అని పేరు పెట్టి, ఇంకా గొప్ప చైతన్యము, పరిపూర్ణత రావడానికి రెండు చెవులలో మంత్రాలు చెప్పారు. శ్రీచంద్రమౌళీశ్వరస్వామి దగ్గర నుండి తెచ్చిన చందనం లలాటం, వక్షస్థలం, పాదాల వద్ద అలంకరించి, అక్కడ బంగారు రూపులు పెట్టి పూజలు చేసి ఆ బంగారు రూపులను అక్కడి బ్రాహ్మణుల అందరికీ మఠం తరపున బహూకరించి, వారిని సన్మానించారు.






పదిగ్రాముల బంగారు డాలర్‌పై ఒకవైపు రామపట్టాభిషేకం, మరోవైపుకు బలం విష్ణోః ప్రవర్ధతామ్, శ్రీరామ శరణం మమ, జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయశీ, 22-1-2024 అని తేదీ ముద్రించారు. అలాగే ప్రత్యేక శాలువాలపై రామమందిరం, శంకరాచార్యులవారు, ప్రతిష్ఠతేదీ ప్రింట్ చేయించారు. ఆ డాలర్ మరియు శాలువాతో ఋత్విక్కులను ట్రస్టీలను ఇంకా






ముఖ్యమైనవాళ్ళను స్వామివారు కంచిపీఠం తరపున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దేశానికి సురక్ష, సుభిక్ష, ప్రజలకు సువిద్య కలగాలని ఆశీర్వదించారు.

రాత్రి 9గం॥ తిరిగి స్కందగిరిలోని శ్రీమఠం శిబిరానికి చేరుకున్నారు. భక్తులు ఆనందోత్సాహాలతో, సువాసినులు హారతులతో స్వామివారికి ఘనంగా స్వాగతం పలికారు.

22వ తేదీ ఉదయం స్వామివారు చంద్రమౌళీశ్వరుని అభిషేకం, రెండు కాలల పూజ పూర్తిచేసుకుని, మఠంలో విశేషపూజలు, రామషడాక్షరీ హోమం, శ్రీసీతారామకల్యాణం చేయించి, అయోధ్యలో విగ్రహప్రతిష్ఠ ముహూర్త సమయానికి రాములవారికి అభిషేకం చేశారు. రాములవారి ప్రతిష్ఠ కార్యక్రమం తిలకించి శ్రీస్వామివారు ఆనందభరితులయ్యారు.

ఆపదామహర్తారం దాతారం సర్వసంపదాం ।
లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహం ॥



# 'అయోధ్య ధర్మప్రచార కేంద్రంగా విలసిల్లాలి'

సౌజన్యం లోపించిడం వల్లనే అయోధ్య ఉద్యమం

అలాంటి ఉద్యమాల అవసరం మళ్లీ రాకూడదు

సనాతన ధర్మంపై దాడి దురదృష్టకరం

**విగ్రహారాధనకు హిందూ మతంలో ఎంతో ప్రాశస్త్యం ఉన్నది. ప్రతి చైతన్యానికీ మన పూర్వీకులు ఒక రూపం ఇచ్చి పూజించారు.. విఘ్నాలు హరించే విఘ్నహర్తగా వినాయకుడి రూపం, జ్ఞానానికి రూపంగా సరస్వతి..ఇలా అనేకానేక రూపాలను కల్పించారు. కాని ధర్మానికి రూపం ఇస్తే శ్రీరాముడిలా ఉంటుందన్నది ఏకాభిప్రాయం... అందుకే వాల్మీకి మహర్షి రామాయణంలో సకల గుణాభిరాముడిని మనకు పరిచయం చేస్తారు. అరిషడ్వర్గాలను అధిగమించి, సత్యాన్ని, ధర్మాన్ని అనుసరించే ఒక వ్యక్తిత్వమే శ్రీరాముడు. అందుకే, ఆయనను 'రామో విగ్రహవాన్ ధర్మః' అంటూ అభివర్ణించారు. రాగద్వేషాలకు అతీతమైన, సార్వజనీనమైన, సర్వవ్యాపకమైన, సర్వాత్మభావన – ఏకాత్మ భావనతో కూడిన ధర్మానికి పోతపోస్తే శ్రీరామచంద్రుడు అవుతాడు అంటారు కంచి కామకోటి 70వ పీఠాధిపతి, జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి స్వామివారు. అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా 'జాగృతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వారు రాముడు, భారతీయత, ధర్మంతో సహా పలు అంశాలను విశదీకరించారు.**

**ప్ర: భారతీయతపై శ్రీరాములవారి ప్రభావం ఎంతటిది? మీ అభిభాషణం ద్వారా మా పాఠకులకు తెలియజేస్తారా స్వామి ?**

**జ:** అందరూ కూడా రాములవారి పేరు పెట్టుకుంటారు. ఉత్తర దక్షిణాలు, వెనుకబడిన ప్రాంతాలు, వర్గాలు అని తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో భక్తులు ఉన్నారు. వెనుకబడిన ప్రదేశమని మనం అనుకునే సమాజంలో కూడా రామభక్తి ఉంది. ఆ పేరు మంచి విలువలను, ఆదర్శాలను, శక్తి సామార్థ్యాలను ప్రసాదిస్తుందని



నమ్మకం. దాన్ని సదుపయోగం చేసుకోవాలి. స్వీయనియంత్రణ మన భారతీయ ధర్మం నేర్పుతుంది. మనుష్య జాతిలో సెల్ఫ్‌కంట్రోల్ అనేది ఏ పని ఎంతవరకు చెయ్యాలో అనే నైతిక విలువలను నేర్పుతుంది. ఈ విలువలను కోల్పోకుండా కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ దానికి లామినేషన్‌లా ఒక ఆచ్ఛాదనను సృష్టించుకోవాలి. ఆదర్శమానవ జీవితమన్నది ఆచరణీయ, ఆదరణీయ భారతీయ ధర్మం. అందరికీ ఆనందాన్ని కలిగించే ధర్మం. అటువంటి ధర్మానికి ఆదర్శం శ్రీరాముడు.. అందుకే రామో విగ్రహవాన్ ధర్మః అన్నారు. భారతీయత, సనాతన సంస్కృతి రెండూ ఒకటే.

**విగ్రహారాధన:**

ఈ మధ్యకాలంలో కొందరు విగ్రహాలను నిగ్రహం చేశారు. మన ధర్మంలో విగ్రహారాధన అనేది చాలా ముఖ్యం. జడంలో చైతన్యాన్ని నేర్పించింది మన ధర్మం. చైతన్యంతో కూడిన మనుషులు జడంగా ఉండకుండా స్పందించాలి. పేదరిక నిర్మూలన, వైద్య, వృద్ధసేవ, కుటుంబాన్ని బాధ్యతతో చూసుకోవడం నేర్చుకోవాలి. ఇది కేవలం జాతీయత కాదు నాగరికత.(నాగరికత అంటే సివిలైజేషన్)

భారతీయత అంటే వ్యక్తులను చూడడం కాదు వ్యక్తిత్వం చూడాలి. అలా చూసినప్పుడు రాములవారి చరిత్ర అనేది ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది. వినయం విధేయత, వివేకములతో కూడిన విక్రమం చూపించారు కనుకనే సమస్త మానవాళికి ఆయన చరిత్ర స్ఫూర్తిదాయకం.


గర్వరహిత, గౌరవసహిత జీవనం గడుపుతూ కర్మ, జ్ఞాన, భక్తి మార్గాల త్రివేణిగా ఉండేవారు. మహర్షులను కలిసినప్పుడు ఆయనది జ్ఞాన మార్గము. శబరి వంటివారితో కలిసినప్పుడు భక్తి మార్గం. అమాత్య వర్గంతో కలిసినప్పుడు కర్మ మార్గం. ఇలా రాములవారి భావాలు భారతీయులను ప్రభావితం చేస్తాయి.

ప్ర: అయోధ్య పోరాటం నుంచి, చరిత్ర నుంచి నేటితరంవారు, భవిష్యత్‌తరాలవాళ్ళు ఏమి చూడాలి, ఏమి నేర్చుకోవాలి? ఏలా స్ఫూర్తి పొందాలి?

జ: సంఘ శక్తి అనేది మనకు ముఖ్యమైనది. సర్కారు నిర్మాణం, రెండవది సమాజ నిర్మాణం, మూడవది శాస్త్ర నిర్మాణం.

సర్కారు నిర్మాణం :

ఆ మూడు నిర్మాణాలలో సర్కారు వ్యవస్థీకృత నిర్మాణం జరుగుతోంది. కేంద్రానికీ, రాష్ట్రాలకూ మధ్య సంబంధాలు చాలా ముఖ్యమైనవి. సరిహద్దులు, రక్షకదళాలు సప్తాంగం, ఆరోగ్యానికి అష్టాంగం, పూజలకు పంచాంగం అని అంటుంటారు. మనది ప్రజాతంత్రం కనుక ప్రతి వ్యక్తీ ముఖ్యం. సప్తాంగాలలో కూడా వికాసం కావాలి. ఈ విషయాలలో మనం ఎక్కడ ముందున్నామో, ఎక్కడ వెనకున్నామన్నది వ్యక్తులు తెలుసుకోవాలి. సర్వ సమాజాల మధ్య సౌజన్యానికి విదేశీ నీతి, భద్రతతో, రక్షణలో ఉండేందుకు దేశీయ అవసరం నీతి అవసరం.



సమాజ నిర్మాణం:

వర్గానికి, వ్యక్తికీ విభేధాలు ఉన్నప్పటికీ, కుటుంబమనేది అత్యంత ముఖ్యమైనది. అదే సమయంలో మన పరిసరాలు, వాతావరణం కూడా అంతే ముఖ్యం. ఇవాళ రేపు ప్రతి చోట సిసిటివిలు పెడుతున్నారు. దానికన్నా కాంటాక్ట్, కల్చర్, కాన్ఫిడెన్స్, టాలరెన్స్, టాలెంట్, వాల్యూస్ అన్న సిసిటివిలు ఏర్పాటు కావాలి.

శాస్త్ర నిర్మాణం:

మందిరాలు, ధర్మసంస్థానాలు, వేదపాఠశాలల ద్వారా శాస్త్రం ప్రచారమైంది. అలాగే, గురుకులం వంటివాటి ద్వారా ఆధ్యాత్మ విద్యావిధానం ప్రచారం అయింది. భగవద్గీతలో చెప్పినట్టుగా వేదాన్ని, శాస్త్రాన్ని, ట్రెడిషినల్ ఆర్ట్ అండ్ మ్యూజిక్‌ని ప్రచారం చేయాలి. ఈ నేపథ్యంలో శబ్దార్థం, భావార్థం, పరమార్థం అన్నీ ముఖ్యం.

అయోధ్య పోరాటం:

పోరాట నేపథ్యం – సౌజన్యం, శాస్త్రంను గౌరవిస్తున్న, ఆచరిస్తున్న, నమ్ముతున్న అనుసరిస్తున్న మనుషుల సంఖ్య తగ్గటం, సరైన ప్రభుత్వ స్పందన లేకపోవడం వల్ల జరిగింది.

లోకంలో భారతదేశము, సనాతనధర్మం గురించి సరైన అవగాహన లేకపోవడం, విదేశీయులు దీనిని ఒక రాజకీయ, వ్యాపార కేంద్రంగా వాడుకోవడం నేటి దుస్థితికి కారణాలు. విదేశంతో ఎంతమేరకు సంబంధం ఉండాలో అంతమేరకు ఉండాలి. ఆ సంబంధం సరిగ్గా ఉండాలి. ఆత్మనిర్భర్ భారత్‌ను తయారుచేయాలి. అప్పుడు ఇలాంటి పోరాటం అవసరం ఉండదు.

మనదైనది మన దగ్గరే ఉండాలంటే నిత్యానుష్ఠానం (నిత్యపూజ) ముఖ్యం. భక్తి అనేది ఈవెంట్ మేనేజ్‌మెంట్ కాకూడదు. కుటుంబ విలువలు, నిజాయితీగా పని చేయడం, దేశభక్తి, దైవభక్తి ఇక్కడి ప్రజలకు ముఖ్యంగా ఉండాలి. అప్పుడు ఈ 140 కోట్ల జనాభా ఉన్న దేశాన్ని కాపాడటం తేలిక అవుతుంది. భాష, ఆచారం ఏదైనప్పటికీ దేశం విషయంలో భారతీయ సంస్కృతి విషయంలో అందరూ ఐకమత్యంతో వ్యవహరించాలి. పోరాటమనేది చట్టం, న్యాయ, రాజకీయ స్థాయిల్లో జరిగింది. అవగాహన లేకపోవడం, భీతి, అసంతృప్తి, అత్యాశ, విదేశాల జోక్యం ఇవన్నీ దేశాన్ని, ప్రజలను బలహీనం చేశాయి.

ఏయే కారణాలతో పోరాట పరిస్థితి వచ్చిందో అటువంటి పరిస్థితులను నివారించేందుకు చర్యలు తీసుకోవాలి. సమాజాన్ని శక్తిమంతం చేయాలి. ప్రతి మనిషీ కూడా తన స్వార్థంతో పాటు దేశసంక్షేమం గురించి ఆలోచించి సహాయ సహకారం, సహమతి,


ఏకమతి అందించాలి. 'సహమతి' చేయడానికి 'సన్మతి' కావాలి.

**ప్ర: అయోధ్య ఉద్యమంలో కంచి పీఠం, జయేంద్ర స్వాముల వారి పాత్ర, కంచికి అయోధ్యకు అనుబంధం?**

**జ.** శ్రీ జయేంద్ర సరస్వతీ స్వామివారు మొదటి నుండి కీలకపాత్ర పోషించారు. పాతభవనంలో దర్శనానికి అనుమతి తెప్పించడంలో స్వామివారు పోషించిన పాత్ర ముఖ్యమైంది. ప్రత్యక్ష, అప్రత్యక్ష రూపంలో వారు అనేక కార్యక్రమాలు చేశారు. ధార్మిక అనుష్ఠానాలు చేయించారు. దాని కోసం యాత్రలు ఎక్కువగా చేశారు. అవగాహన ప్రబోధన, ఉద్బోధన సదస్సులు, ప్రోత్సాహక సదస్సులు, శాంతి సదస్సులు, హిందువులు, ఇతర విశ్వాసాల వారితో సౌజన్య సభలు నిర్వహించారు. రామ జన్మభూమి అనేది రావాలి, వస్తుందనేది వారి ఆశయం, అభిప్రాయం. ఆ నమ్మకం మేరకు అయోధ్యలో కంచి మఠాన్ని ఆనాడే స్థాపించారు.

1986 ఫిబ్రవరి ఉద్ఘాటన కోసం ఉద్యమం ప్రారంభం చేసినవారు మన స్వామివారే. కంచిలో పెద్ద స్వామివారు (పరమాచార్య) ఉండే వారు. వారితో మేము కూడా అక్కడే ఉన్నాము. రాములవారికి ఛత్ర, చామరాలను విమానంలో మహాస్వామివారు పంపించారు. అప్పుడు ప్రయాగలో ఉన్న జయేంద్రస్వామివారు ఆ ఛత్రచామరాలను రాములవారికి సమర్పించారు. కంచి పరమాచార్యులు శ్రీ జయేంద్ర సరస్వతి స్వామివారిచే అయోధ్యరాములవారికి మొదటిపూజ చేయించారు. ఆ సమయంలోనే అడియబళంనీలకంఠ దీక్షితలుగారు, మండకుళత్తూరు రామ్మూర్తి శాస్త్రిగారి చేత వాల్మీకి రామాయణం, తులసీరామాయణం పారాయణ చేయించారు.

2023 అక్టోబర్‌లో మేము అయోధ్యలో నవరాత్రికి ఉన్నాం. ఏకాదశిరోజున స్వామివారిని దర్శించుకొన్నాం. అది శక్తి పీఠం కనుక నవరాత్రి అక్కడ గడిపాం. పంచభూత శక్తి పీఠాలలో పృథివీ(మట్టి) క్షేత్రం అయోధ్య.అయోధ్యాదిషు పీఠేషు పృథివ్యాదిషు అనుక్రమాత్॥ సౌభాగ్య చింతామణిలో (శ్రీవిద్యా గ్రంథం) ఈ ప్రస్తావన ఉంది. (ఈ గ్రంథం ప్రకారమే కంచి అమ్మవారి పూజలన్నీ చేస్తారు) అక్కడ ఇక్ష్వాకు వంశీయుల కుల దేవత గుడికి కూడా వెళ్లాం. (హిందు, ముస్లింలతో చర్చలు జరిపినప్పుడు జయేంద్రస్వామి కూడా వెళ్లారు.) రాముని దైవంగా మనం పూజిస్తున్నాం. కానీ ఆయన పూర్వీకులకు కూడా ఒక కులదేవత ఉంది. ఆ అమ్మవారే దేవకాళి. మేము ఆ ఆలయాన్ని కూడా సందర్శించాం. శ్రీ జయేంద్రస్వామి సంకల్పము, ప్రకల్పము మందిర నిర్మాణం ద్వారా పరిపూర్ణమవడంతో అందరికీ సంతోషం కలుగుతున్నది.




ప్ర: సనాతన ధర్మం పై దాడితో సాధారణ హిందువు బాధపడుతున్నాడు.. మీరు ఎలాంటి సాంత్వన ఇస్తారు?

**జ:** దురదృష్టం. దేశ దుస్థితి కూడా. 'ఏతి జీవంతమానందః, నరం వర్ష శతాదపి' అంటారు. ఈ పరిస్థితి నుంచి మనం బయిట పడతాం. అందుకు మనకు ఆత్మవిశ్వాసం, ఈశ్వరుని మీద నమ్మకం, ప్రజల మధ్య పరస్పర సహకారం కావాలి. ఈశ్వర వచనంపై నమ్మకం పెట్టాలి. సుస్థిరమైన సుఖానికి స్థిరమైన చర్య కావాలి. ధర్మంపై విశ్వాసాన్ని పెంచుకోవాలి.

సనాతన ధర్మంపై దాడి అంటే నేతలు, దాతలు కూడా ధర్మ ప్రచారం చేయాలి. దానిని క్షేత్ర స్థాయినుంచి ప్రారంభించాలి. గ్రాస్ రూట్ లెవెల్ నుంచి మైక్రో ఛారిటీ జరగాలి. చిన్న గుళ్లల్లో కూడా ధూపదీప నైవేద్యాలు, చిన్న చిన్న హోమాలు, యాగాలు జరుగుతూ ఉండాలి. 'యజ్ఞోదానం తపశ్చైవ పావనాని మనీషినాం' అన్నారు. యజ్ఞము, దాతృత్వం, క్రమశిక్షణ ఉండాలి. 'ఆత్మ దర్శనం' తప్ప మనది 'ప్రదర్శనం' కాదు. అన్ని మతాల మధ్య (సిఎమ్‌పి)'కామన్ మాగ్జిమమ్ ప్రోగ్రాం' జరగాలి. ఎవరైనా మంచి పని చేస్తుంటే గౌరవించడం, ఈరోజుకీ సనాతన సంస్కృతిని గౌరవించడం అనేది చాలావరకూ దేశంలో ఉంది కనుకనే ఇంత శాంతి సాధ్యమైంది.

ఈ భారతీయ మట్టిలోనే మంచి స్వభావం ఉంది. దాన్ని అందరూ కలిసి కాపాడాలి. చరిత్రలో కొన్ని మార్పులు జరిగాయి. భారతదేశం తన నిజ రూపదర్శనం కోసం ఆలోచించాలి. మధ్యలో వచ్చిన మార్పులు, ఏర్పడిన ద్వేషాల నుంచి ముక్తిని పొందాలి. అందరికీ ఆరోగ్యం, సుఖశాంతి కలగడానికి అందరూ ప్రయత్నించాలి, ప్రార్థన చేయాలి. సమాజవికాసానికి ప్రయత్నం చేయాలి. ప్రార్థన, ప్రయత్నం రెండూ రెండు కళ్ళ వంటివి. అదే రాములవారి సందేశం. బలం విష్ణోః ప్రవర్ధతాం అనేది. సహానుభూతి యొక్క అభివ్యక్తి. జనవరి 22వ తేదీ జరుగబోతున్న కార్యక్రమం సహానుభూతి, సౌజన్యంతో కూడుకున్నది. దీన్ని మనం పోటీ కాకుండా చూడాలి. ఇది భారతదేశం





యొక్క ఆస్తి, సౌజన్యం, స్వామిత్వం, అనురాగం, ఔదార్యం కూడా. ధర్మంలో, సమాజంలో, ప్రభుత్వంలో మనం చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి. కనుక, సకారాత్మక ఆలోచన ద్వారా దేశం యొక్క పురోగతికి, ప్రగతిలో అందరూ కీలక పాత్ర వహించాలి.

ధైర్యమనేది మనలో వ్యాపించాలి. ఉద్దేశ్యం మంచిగా ఉండి, బుద్ధి ద్వేష భావం లేకుండా ఉండాలి. భగవంతుడు ఇచ్చిన గాలి,నీరూ పంచుకోవాలి. ఇంకొకరి సొమ్ముకి ఆశపడకూడదు. అధికారాన్ని పంచుకున్నాం. బాధ్యతను కూడా పంచుకున్నప్పుడే మనం వసుధైక కుటుంబకాన్ని సాకారం చేయగలం.'ఈశావాశ్యం ఇదం సర్వం యత్కించ జగత్యాం జగత్ తేన త్యక్తేన భుంజేథాః మా గృధః కస్యస్విత ధనం'మరొకరి సొమ్ముకు ఆశపడకూడదు. మనం అధికారాన్ని పంచుకున్నాం కానీ బాధ్యతలను పంచుకోలేదు.

కృష్ణయజుర్వేదంలో దేవానాం పూరయోధ్య అన్నారు... అక్కడ గుడి కడుతున్నారు. ఇంకా ధార్మిక విద్యా కేంద్రాలు కూడా బాగా రావాలి. ఉత్తర శక్తి- దక్షిణ భక్తి మన సంస్కృతికి కలిపి చేయాలి. అవన్నీ ఒకటైనప్పుడు 'భారత్ మహాన్ మహత్వం మనకు వచ్చినట్లే. (మాజీ ఉపరాష్ట్రపతి కృష్ణకాంత్‌గారు వచ్చినప్పుడు చంద్రశేఖర మహాస్వామివారు 'భారత్ మహాన్' అని ప్రస్తావించారు.) పంచయజ్ఞంలో వైశ్వ దేవ ప్రతినిధి కింద ముష్టి తండులం అని మహాస్వామివారు చెప్పిన పిడికెడు బియ్యం స్కీమ్‌లాగా అందరూ కలిసి దానం, యోగదానం చేయాలి. ప్రతి గ్రామ రామాలయంలో ప్రజలు దీనిని ఆచరించి ఆశీస్సులు పొందాలి.

**ప్ర: అయోధ్య ఒక అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రం కాబోతోంది కనుక అక్కడ ఎలాంటి ఏర్పాట్లు ఉండాలని మీవంటి వారు భావిస్తున్నారు?**

**జ:** స్వాతంత్ర్యానంతరం లౌకిక విద్యలో ప్రావీణ్యం వచ్చింది కానీ ఆత్మనిర్భరం అవ్వలేదు. అది కూడా మనం గుర్తించాలి. ఇంకా మనవాళ్ళు చదువులకు విదేశాలు వెళుతున్నారు. భారత్‌లో ఉన్న ధర్మ విద్యాసంస్థల సంఖ్య తగ్గకుండా చూసుకోవాలి. అయోధ్యలో ధర్మ ప్రచార విద్య కోసం ధర్మ విద్యా కేంద్రం ఏర్పాటు కావాలి. ధార్మిక ఉచ్ఛ శిక్షా కేంద్రం. ధార్మిక సంశోధనం ఏవం అనుభూతి కోసం ఒక ఆధ్యాత్మిక కేంద్రం ఉండాలి. వివిధ స్థాయిల్లో ధర్మ ప్రచారం కొనసాగే విధంగా ప్రతి ఆలయంలో శాస్త్రీయ పద్ధతిలో ధూపదీప నైవేద్యాలు, ఉచ్చారణ, ఉపదేశం, ఉద్దేశ్యానికి అనుగుణంగా, అయోధ్యకు అనుబంధంగా వ్రజ్ ప్రాంతం, అవధి, పూర్వాంచల్‌లలో కూడా ఈ కార్యక్రమాలు కొనసాగాలి. టిటిడిలో ఉన్నట్టుగా ధర్మ ప్రచార పరిషత్తు ఒకటి ఏర్పాటు చేయాలి. పండా, పూజారి, పురోహిత్ కళ్యాణ యోజన ద్వారా వారికి ఉపాధి, ఉపకారం వంటి ఏర్పాటు చేయాలి. ధర్మవిద్యా కేంద్రంగా ఉండాలి. నాద నీరాజనం వంటి కార్యక్రమాలు నిర్వహించాలి.

**'హర్ పంచాయత్ మే పండిత్ హోనా! హర్ మందిర్ తిరుపతి హోనా!'**

**ప్ర: కాశీ మధురల మీద అయోధ్య ప్రభావం ఎలా ఉంటుంది?**


**జ:** మనకు కావలసింది భావన, మిగిలినది అంతా భగవంతుని అనుగ్రహం. శాంతి భద్రతలు మనకు చాలా ముఖ్యం. కాలం, సమయం అన్నీ కలిసి వచ్చినప్పుడు సందర్భం వస్తుంది. మంచిని కోరుకుందాం.

**ప్ర: హిందూ ధర్మం ఇతర మతాలకన్నా ఎలా భిన్నం?**

**జ:** సనాతన ధర్మమనేది సార్వజనీనం, రాగద్వేషాలకు అతీతం. జడం, చైతన్యం అన్నింటినీ సమానంగా చూడగలది, చూసేది, అపరిమితమైనది ధర్మం. సనాతన ధర్మం సర్వవ్యాపకం - సర్వాత్మ భావం - ఏకాత్మభావం. విశ్వంలోని సకల చరాచర శ్రేయస్సును కోరుకునే ధర్మం మనది. సర్వే జన సుఖినోభవంతు అని కోరుకునే ధర్మం. "దేహానికీ, దైవానికీ మధ్య "దేశాన్ని" మరవవద్దు" ఇదే యువతకు మేము ఇచ్చే సందేశం.

భారతం విశ్వగురువు కావాలి. ఈ విశ్వానికి చక్రవర్తి కావాలి. అందుకు ఆ శ్రీరాముని అనుగ్రహం సదా ఉండాలి.


**మంగళం కౌసలేంద్రాయ మహనీయ గుణాత్మనే**
**చక్రవర్తి తనూజాయ సార్వభౌమాయ మంగళం**



# 'భక్తి సామాన్యమనిషిగా ఉన్న కన్నప్పను భక్తకన్నప్పగా మార్చింది'

సానందమానందవనే వసంతం ఆనందకందం హతపాపబృందమ్।
వారాణసీనాథమనాథనాథం శ్రీవిశ్వనాథం శరణం ప్రపద్యే ॥

కేరళరాష్ట్రంలో కాలడిలో పుట్టినటువంటి శంకరులు దేశం నలుమూలలా పాదయాత్ర చేశారు. వారిని నంబూద్రి అని అంటారు. ఆంధ్రదేశంలో ఇంటిపేరులాగా వాళ్ళకి ఇల్లం అని పేరు ఉంటుంది. కేరళ నుండి కొంతమంది కంచిలోని శంకరమఠానికి వస్తే వారిని శంకరాచార్యుల విగ్రహం దర్శించమని చెప్పాము. కేరళలో పుట్టిన శంకరాచార్యులు కేదార్‌నాథ్, కాశ్మీరు, ఖాట్మండులో ఉండే పశుపతినాథ్



క్షేత్రానికి వెళ్ళి కంచికి వచ్చారు. అనేక దివ్యక్షేత్రాలకు పాదయాత్రగా వెళ్ళి 32 ఏళ్ళ వయస్సులోనే ఎన్నో పుణ్యక్షేత్రాలను సందర్శించారు. శ్రీశైలంలో భ్రమరాంబ అమ్మవారి దర్శనంచేసుకుని భ్రమరాంబ అష్టకం వ్రాశారు.

**గాయత్రీం గరుడధ్వజాం గగనగాం గాంధర్వగానప్రియాం**
**గంభీరాం గజగామినీం గిరిసుతాం గంధాక్షతాలంకృతామ్ ।**
**గంగా గౌతమీ గర్గసంనుతపదాం గాం గౌతమీం గోమతీం**
**శ్రీశైలస్థలవాసినీం భగవతీం శ్రీమాతరం భావయే ॥**

గుళ్ళలో అవకాశం ఉన్నచోట్ల గాంధర్వగానం, సామగానం పెడుతూ ఉంటారు. 'గాంధర్వగాన ప్రియాం, గంభీరాం' గాంభీర్యమంటే అనవసరమైన మాటలు గాని ఆలోచనలు గానీ లేకపోవటం అని చెప్పొచ్చు. గంభీరమైన మనిషి అంటే ఎవరితో మాట్లాడని మనిషి అని నిర్వచించకూడదు. ఏనుగులాగా నిదానంగా తొందరపాటు లేకుండా ఉండటం. కుంకుమలో కలిసిన చందనం ఘనసార కుంకుమయుతాం. అలాంటి గంధాక్షతలతో అలంకృతమైన లోకమాతని భ్రమరాంబి కారూపంలో శంకరాచార్యులు స్తుతించి, పూజించారు.

శంకరులు శ్రీశైలం కొండలలో తపస్సు చేసుకున్నారని మహాస్వామి వారు ఆ స్థలాన్ని మనకు చూపించారు. ఆ విషయం అప్పటి ఆంధ్రప్రభ పత్రికలో ప్రచురించారు. శంకరాచార్యులవారు శ్రీశైలంలో మల్లికార్జున స్వామిని పూజించిన తరువాత అహోబిలాన్ని దర్శించుకుని కాళహస్తీశ్వర స్వామిని గురించి చెప్తూ **'భక్తిః కిం నకరోత్యహో వనచరో, భక్తావతంసాయతే'** అని కీర్తించారు.

భక్తి సామాన్య మనిషిగా ఉన్న కన్నప్పను భక్తకన్నప్పగా మార్చింది. నేత్రార్పణేశ్వర ఆలయం తంజావూరులో ఉన్నది. సహస్ర కలువపూలతో మహావిష్ణువు శివుణ్ణి పూజించినట్లుగా అక్కడి ఐతిహ్యం. 999 తామరపూలతో అర్చన అయిన తర్వాత ఒక పూవు తక్కువయ్యింది. ఆ సమయంలో మహావిష్ణువు తామరపూవు వంటి తన కన్ను తీసి పెట్టారట. అలాగే కాళహస్తీశ్వరస్వామి దగ్గర ఉండే భక్తకన్నప్ప తన కన్నులు కూడా ఇచ్చి ఆత్మసమర్పణభావం చూపించారు అంటారు. భక్తిలో శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం అనేవి ఉంటాయి. పూలు, పండ్లు, కొబ్బరికాయలు, పులిహోర, లడ్డు నివేదనం చేయడం ఇలాంటివే కాకుండా భారతదేశంలో శ్రీముక్తం అనే క్షేత్రంలో కందగడ్డతో ప్రత్యేక నివేదన చేస్తారు, శ్రీరంగంలో దోసె, కంచిలో ఇడ్లీ, ఒక్కొక్క ప్రసాదానికి ఒక్కొక్క క్షేత్రంలో మహత్యం ఉంది. ఆ క్షేత్రంలో నివేదన చేస్తారు కనుక ఆ భక్ష్యానికి గౌరవం. శ్రీకాళహస్తిలో ఆత్మనివేదనం ముఖ్యం.

తంజావూరులోనే అవుదయార్ గుడి ఉంది. అక్కడ ఆత్మనాథస్వామి యోగాంబఅమ్మవారు ఉంటారు. మాణిక్యవాసకర్ ఆ రోజుల్లో మంత్రిగా ఉండి గుడి కట్టించారు. ఆ గుడిలో మండపానికి చివర కొడంగై అని ఒక అలంకారం ఉంటుంది. అది రాతితోరణంలాగా ఉంటుంది. అప్పటి బ్రిటీష్ ఇండియా అధికారి వచ్చి తుపాకీతో తీస్తే ఆ ద్వారం తెరుచుకున్నదట. అంటే రాతితో అంత గొప్పగా ఆ శిల్పి కట్టాడని చెప్తారు. అప్పటి శిల్పకళకు అద్భుత నిదర్శనం అవుదయార్ కోయిల్. అక్కడ యోగాంబ అమ్మవారికి అన్నం(కుతువై) నివేదన చేస్తారు. (యాత యాన్నం గతివసం । భూతిభవ్యతయం జయతి ॥) అంటారు కాని యోగాంబ అమ్మవారికి అన్నం వండగానే ఆవిరితో చూపించాలి. అది అక్కడి విశేషం.

కొన్ని ప్రముఖమైన గుళ్ళలో స్థలవృక్షాలు ఉంటాయి. ఉదాహరణకి ఏకామ్రేశ్వరస్వామి మామిడిచెట్టు. వేదారణ్యం అనే ఊరు వేదాలకు ప్రచారంగా ఉన్న స్థలం. అలాగే వృక్షారణ్యం, బిల్వారణ్యం, చంపకారణ్యం అని ఊర్లు ఉన్నాయి. చంపకారణ్యంలో మన్నార్‌గుడి ఉంది. ఆ ఊరి పక్కనే 'ఇరుళ్‌నీకి' అనే క్షేత్రంలో జయేంద్రస్వామివారు

పుట్టారు. (ఇరుళ్ అంటే చీకటి, నీకీ అంటే పోగొట్టడం.) అలా చీకటిని పోగొట్టడం అనే ఊరిలో స్వామివారు పుట్టారు. ఈ విధంగా మనదేశంలో ప్రకృతిని, ప్రత్యక్షంగా కనిపించే తల్లిదండ్రులను, లోకానికి తల్లిదండ్రులు అయిన పార్వతీపరమేశ్వరులను గౌరవిస్తాం.

**సృష్టికర్త్రీ బ్రహ్మరూపా గోప్త్రీ గోవిందరూపిణీ ।**
**సంహారిణీ రుద్రరూపా తిరోధాన కరీశ్వరీ ।**
**సదా శివానుగ్రహదా పంచకృత్య పరాయణా ।**

పంచకృత్యపరాయణగా ఉండే అమ్మవారిని మనం గౌరవిస్తాం. భారతదేశం ఒక విశ్వాసానికి సంబంధించిన దేశం. శాస్త్రం అంటే నడత, నడక, ఆనందం, ఆరోగ్యం అని మన విశ్వాసం. 'శతమానం భవతి । శతాయుః పురుషః శతేంద్రియ ఆయుంష్యేవేంద్రియే ప్రతితిష్ఠతి' అన్న వేదమంత్రాలలోని ఆశీర్వచనం కార్యరూపంలో సఫలం కావడానికి అనుకూలమైన ఉపదేశం కూడా ధర్మశాస్త్రం చెప్పింది. అందుకే మనదేశం యొక్క చిహ్నంలో 'సత్యమేవ జయతే' అని ముద్రిస్తారు. అది ఉపనిషద్వాక్యం. నిజం అంటే ఒక పదార్థం, వస్తువు, పాత్ర



కాదు. నిజం ఎవరి దగ్గర ఉందో వారే గెలుస్తారు అని తాత్పర్యం.

**'న కేవలస్య సత్యస్యవా అమృతస్యవా**
**జయః పరాజయోవా విద్యతే**
**కింతుః సత్యవా నియమ జయతే ॥'** అని శంకరాచార్యులు భాష్యంలో చెప్తారు. 'నిజానికి' ఓటమి ఉండదు. ఎవరి దగ్గర సత్యం ఉంటుందో వారే గెలుస్తారు. అలా సత్యాన్వేషణ మనం చేస్తూ ఉంటాం. అశుద్ధమైన అద్దంలో ముఖం కనిపించడం కష్టం. మన బింబమే ప్రతిబింబం. దర్పం లేకపోతే దర్పణంలో కనిపిస్తుంది. ఆ దర్పం అనేదే అహంకారం. అహంకారం అజ్ఞానాన్ని కలిగిస్తుంది. స్వచ్ఛమైన, నిర్మలమైన, ప్రశాంతమైన మనస్తత్వాన్ని కలిగి ఉండటం ఒకరోజులో సాధ్యమయ్యే విషయం కాదు. అందుకని నిత్యం సంధ్యావందనం చేసి, దీపం వెలిగించండి, ముగ్గులు వేయండి, తులసిపూజ చెయ్యండి. హారతులు ఇవ్వండి, నైవేద్యం పెట్టండి. భగవన్నామ జపము ఉదయము, సాయంత్రం చేయండి. సుప్రభాతం రోజు చదవండి. అలాంటి దినచర్యను మన కుటుంబంలో పాటించడానికి కారణం క్రమశిక్షణ, క్రమబుద్ధి. అలాంటి జన్మ తపస్సు, త్యాగం, ఉపవాసం, మౌనంవ్రతం పుణ్యం చేసి, శ్రమపడితేనే వస్తుంది.

తల్లిదండ్రులు పిల్లలకు చిన్నవయస్సు నుండీ సంస్కారాలు నేర్పించాలి. శైశవే అభ్యస్త విద్యానాం... యౌవ్వనే విషయైషిణాం । వార్ధకే మునివృత్తీనాం । యోగేనాంత్యే తనుత్యతాం ॥ చిన్నవయస్సులో ఉన్నప్పుడు విద్యాభ్యాసం చేయించాలి. యవ్వనంలో సమాజహితం కోసం పనిచెయ్యాలి. శంకరాచార్యులు బ్రహ్మచారి దశలో 'భవతి భిక్షాం దేహి' అని కనకధారాస్తోత్రము చెప్పారని మనకు తెలుసు. అలా బ్రహ్మచారిగా ఉన్నప్పుడు భిక్షాచరణం చేస్తారు. దానివలన వాళ్ళలో ప్రేమ పెరుగుతుంది. వినమ్రత పెరుగుతుంది. చదువుకుంటూ పుణ్యం, పాపం, శాస్త్రం తెలుసుకుని గృహస్థాశ్రమంలో అడుగుపెట్టాలి. గృహస్థాశ్రమం ఉత్తమాశ్రమమని అంటారు. గృహస్థాశ్రమంలో ఉండేవారు బ్రహ్మచారికి, సన్యాసికి సేవ చేసే అవకాశం ఉంటుంది. చదువుకునే బ్రహ్మచారులకు వేదము, శాస్త్రము, సంస్కృతము, ధర్మము, భక్తి, చదువు, ప్రేమ నేర్పించే అవకాశం ఉంటుంది. దాతృనిబద్ధతతో మనుషుల్లో ఔదార్యం పెరుగుతుంది.

అలా ధర్మంలో మనస్తత్వం కూడా ముఖ్యం. పూజలు, వ్రతాల్ని ఆచరించినప్పుడు భావార్థం ముఖ్యం. పూజలవల్ల ఆత్మవిశ్వాసం. అహింస, సత్యం, స్థైర్యం వంటి మంచి గుణాలు కలగాలి. నిరాశ ఉండకూడదు. కంపేర్ చేసుకోవడం, నేనే అన్నీ అనుకోవడం, నాకే అన్నీ తెలుసు అనుకోవడం కాకుండా సర్వార్థభావన ఉండాలి.

అన్నింటిలో మనం పరమాత్మని చూడాలి. అంతటా సమాన ప్రేమను చూపించాలి.

గుడికి వెళ్ళినప్పుడు తల్లిదండ్రులు పదిరూపాయలు దక్షిణ ఇచ్చినా, పిల్లల చేత కూడా చేయించాలి. ఈ విధంగా ధర్మాన్ని చిన్నతనంలో నేర్పిస్తే తరువాత సహజంగా అలవాటుగా మారిపోతుంది. ధర్మాన్ని తెలుసుకోవడానికి ముందు ధర్మం యొక్క ప్రాశస్త్యాన్ని తెలుసుకోవాలి అంటే ఎలా ఉపయోగపడుతుందో తెలుసుకుంటే దాన్ని మనం ఆచరిస్తాం. గుడిలో మంచి కార్యక్రమాలు, సత్సంగాలు ఉంటే జనం వస్తారు. (భాగవతసప్తాహం, దేవీభాగవతం లాంటివి పెట్టించి ధర్మం యొక్క ప్రయోజనాలు తెలియజేయాలి.)

సనాతనధర్మంలో స్వచ్ఛత, ఔదార్యము, బాధ్యత అన్నీ ఉంటాయి. మంచిపనులు చేయడానికి అందరూ బాధ్యత వహించాలి. సువాసినీపూజ, దంపతీపూజ, పండిత సత్కార్యం లాంటి కార్యక్రమాలు చేసేటప్పుడు తీసుకునేవారికి దండ వేసి, నమస్కారం చేసి, పసుపు కుంకుమ పెట్టి, గౌరవించి, వినమ్రంగా దానం ఇచ్చే సంస్కారం మనది.

**'విత్తం త్యాగ సమేతం'**

**'దానం ప్రియవాక్సహితం'**

**'జ్ఞానం అగర్వం'**

**'క్షమాన్వితం శౌర్యం'**

సంపద అనేది త్యాగంతో కలిసి ఉంటుంది. దానం మంచి ప్రేమ కూడిన వాక్యంతో ఉంటుంది. జ్ఞానం అహంకారం లేకుండా ఉంటుంది. శౌర్యం ఉన్నప్పటికీ క్షమాగుణం కలిగి ఉంటుంది. అలాంటి తత్త్వం, మనస్తత్త్వం ఉంటుంది రాజసం, తామసం కాకుండా సాత్త్వికమైన తత్త్వం కలిగిన దేశం మనది. స్వ కర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః – మనుష్యజన్మకు స్వధర్మానుష్ఠానము, దేవతారాధనం ఆతిథ్యము, అధ్యయనము అవసరము. భగవద్గీత, రామాయణం, సుందరకాండ లాంటివి వింటూ ఉండాలి. మంచినీరు, అన్నప్రసాదాలు పెట్టడం వంటివి ముఖ్యం. 'జ్ఞాన వైరాగ్య సిద్ధ్యర్థం భిక్షాం దేహిచ పార్వతీ – కడుపు నిండడంతో పాటు మనస్సు నిండడం కూడా ముఖ్యం. జ్ఞానవైరాగ్యం చేతనే మనస్సు పరిపూర్ణము, పరిశుద్ధము అవుతుంది. అలాంటి జ్ఞానవైరాగ్యం కోసం భోజనం కనుకనే దానిని మంచి మనస్సుతో, పాత్రలతో వంట మొదలుపెట్టాలి. వంట, భోజనం కూడా





పూజలాగా చేయాలి. ఏ పని చేసినా ప్రేమతో, శ్రద్ధగా చేయండి. ఎవరికీ ఇబ్బంది కలిగించాలనే కోరిక లేకుండా చేయండి. ఇది మన దేశానికీ, ధర్మానికి, సమాజానికి విశిష్టతను ఇస్తుంది.

ఈ రోజుల్లో దేశంలో విజ్ఞానపరంగా అనేక మార్పులు, వికాసాలు వస్తున్నాయి. మంచిరోడ్లు, వాహనాలు, కమ్యూనికేషన్, వచ్చాయి. కానీ ప్రజల మధ్య అవసరమయ్యే కమ్యూనికేషన్‌లో మనం అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉంది. దానికి ధర్మప్రచారం అవసరం. గురువులు, ఇతరులు చెప్పే అవకాశం, వీలు కొంతవరకే ఉంటుంది. అందుకని గుళ్ళలో చరిత్ర గురించి తెలుసుకోవాలి. యుగయుగాలుగా వస్తున్న ప్రాచీనచరిత్ర మనది. ఇక వేదం గురించి పండితులు అపౌరుషేయాలు అని చెప్తారు. అలాంటి వేదాన్ని అక్షరం, స్వరం మార్పు లేకుండా పదదోషం లేకుండా చెప్పగలగాలి.

శ్రుతి స్మృతి పురాణానాం ఆలయం కరుణాలయం – శంకరాచార్యులు ఋగ్ యజుర్ సామ అథర్వణ వేదాలను కాపాడి, వేదరక్షణ కోసం మఠాలను ఏర్పాటు చేసి, 'వేదో నిత్యం అనీయతాం' అన్నట్లుగా వేద సంరక్షణం బాగా జరగాలనుకున్నారు. వేద రక్షణం అంటే రికార్డర్‌లాగా చెప్పేయడం కాకుండా కంఠస్థం జరగాలి. ఆ కంఠస్థం చేయడానికి ఆహార శుద్ధి ఉండాలి. 'ఆహార శుద్ధౌ సత్వ శుద్ధిః' ఆహారశుద్ధితో మనస్సు శుద్ధంగా ఉంటుంది. గోమయంతో భూమి శుద్ధి చేసి, ఆకుని వేసి, నెయ్యి కూడా వేసిన తర్వాత భోజన వడ్డిస్తారు. చివరన మళ్ళీ నెయ్యి అభిఘరిస్తారు. ఆచారం అనేది ఒక్కో ప్రాంతంలో ఒక్కొక్క విధంగా ఉంటుంది. అందులో లౌకికమైన శుద్ధితో పాటు ధార్మికమైన శుద్ధి ఉంది. వేదపాఠశాలలో నియమపూరితంగా అనుష్ఠానం చేస్తూ, నిత్యం సంధ్యావందనం, అగ్నికార్యం చేయాలి. విగ్రహారాధన బాగా ప్రచారంలోకి వచ్చాక అగ్ని ఉపాసన కొంచెం తగ్గింది. అగ్ని ఉపాసనని దేశంలో ప్రచారంలోకి తీసుకురావాలని ఆలోచిస్తున్నాం. అలా చేస్తే ఐశ్వర్యం కలుగుతుంది. ప్రతి పౌర్ణిమకి చండీహోమం చేయమని చెప్పడం వల్ల ముంబాయి, గణపవరం, అరుణాచలం, విశాఖపట్టణం మొదలైన ప్రాంతాలలో చేస్తున్నారు. జపాలు, హోమాలు చేస్తే ద్విగుణీకృతమైన ఫలితం వస్తుంది. 'నదీ తీరే శతగుణం' సముద్ర



తీరే కోటిశ్య' అన్నట్లుగా రామేశ్వరం ప్రక్కన ధనుష్కోటి అని, విష్ణుకంచికి పుణ్యకోటి అని కామాక్షమ్మకు కామకోటి అని ఏకామ్రేశ్వరస్వామి ఉన్న శివకంచికి రుద్రకోటి అని పేరు. మంచి పుణ్యం కావాలి అంటే ఈ ప్రాంతాలలో చండీహోమము, అగ్ని ఉపాసన చేయాలి.

'చత్వారి శృంగాః త్రయో అస్య పాదాః ద్వే శీర్షే సప్త హస్తాసో అస్య' అగ్నిదేవుడికి నాలుగు కొమ్ములు, మూడు కాళ్ళు, రెండు తలలు, ఏడు చేతులు ఉంటాయి. తమిళనాడులో ఒకచోట ఆ అగ్నిదేవత స్వరూపం విగ్రహంగా పెట్టించి, హోమగుండం పెట్టించమన్నాం. ఆయుష్హోమం, షష్ఠిపూర్తి చేసుకున్నందున ఐశ్వర్యం సిద్ధిస్తుంది. 'ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్' – ఆరోగ్యానికి సూర్యనమస్కారం ముఖ్యం. 'శ్రియమేచ్ఛేత్ హుతాశనాత్' – ఐశ్వర్యానికి అగ్ని ఉపాసన ముఖ్యం. 'జ్ఞానం మహేశ్వరాదిచ్ఛేత్' – ఐహిక ఆముష్మిక జ్ఞానం కావాలంటే శివపూజ చేయాలి.

ప్రతిగుడిలో 'పద్ధతి' అనే పేరుతో ఒక కార్యక్రమం మొదలు పెట్టాలని చెప్పాము. ఆ కార్యక్రమంలో ప్రజలకి మన ధర్మస్వరూపం తెలియజేయాలి. నవగ్రహాలు, సప్త ఋషులు, పంచభూతాలు, అష్టదిక్పాలకులు, దశావతారములు, ఏకాదశరుద్రులు, సూర్యుడు మొదలైన విషయాలన్నీ చెప్పి, పంచాంగం చూడడం మొదలు ముగ్గులు వేయడం వరకు అన్నీ నేర్పించాలి. ప్రతిభ, ప్రజ్ఞ రావడానికి సనాతనధర్మం యొక్క పరంపర, గురుపరంపర, కుటుంబ పరంపర తెలియజేయాలి.

ఈ రోజుల్లో ఏ ద్వీపం ఎక్కడుంది మొదలైన విషయాలు తెలుసుకోవడానికి టెక్నాలజీ ఉంది. కాని అవేమి లేని రోజుల్లో ఎక్కడెక్కడ కొండలు, రహదారులు, ద్వీపాలు, నదీనదాలు ఉన్నాయో అన్న జ్ఞానాన్ని పురాణాల ద్వారా ఇచ్చారు. కాకినాడలో చాగంటివారి గోశాలలో ఉన్నప్పుడు 'గోదావరి మహాత్మ్యము' అని ఒక కార్యక్రమంలో గోదావరీతీరంలో 80 పుణ్యక్షేత్రాలు ఎక్కడెక్కడ ఉన్నాయో నేర్పించారు. ఇలా మనదేశ చరిత్ర తెలుసుకోవడానికి ఒక పాఠ్యాంశాన్ని తయారుచేయాలి. శంకరుల ఆశీస్సులతో అందరూ సనాతనధర్మం పట్ల భక్తిశ్రద్ధలు పెంచుకుని, కంచి కామాక్షమ్మవారి దయతో, అవసరమైన మంచిపనులు చేస్తూ 'ధర్మో రక్షతి రక్షితః' అన్న మన ధర్మాన్ని పరిపాలిస్తూ తద్వారా అందరికీ మంచి జరగాలని కంచి కామాక్షి అమ్మవారిని ప్రార్థన చేస్తున్నాం.

**జయ జయ శంకర । హర హర శంకర ।**

# శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామివారి విజయయాత్ర విశేషాలు





శ్రీస్వామివారు నవంబర్ 25వ తేదీన జబల్పూర్ చేరుకున్నారు. గీతాభవన్‌లోని సంత్ రామానంద స్వామి మరియు జబల్‌పూర్ భక్తులు స్వామివారికి ఘనంగా స్వాగతం పలికారు. 26న ఉదయం స్వామివారు దర్శనం ఇచ్చి త్రికాల పూజలు చేశారు. సాయంత్రం కార్తీక దీప ప్రజ్వలన అనంతరం పౌర్ణమి పూజ, లలితాసహస్రనామ పారాయణం. 27వ తేదీ రాత్రి జబల్‌పూర్‌లోని సంత్ సమాజ్‌ను ఉద్దేశించి స్వామివారు అనుగ్రహభాషణం చేశారు. 28వ తారీకు త్రికాల పూజ అనంతరం నాగ్‌పూర్ వైపు యాత్ర ప్రారంభమైంది






28వ తేదీ రాత్రి 10 గంటలకు పూజ్యశ్రీ స్వామివారు నాగ్‌పూర్ చేరుకున్నారు. నవంబర్ 29వ తేదీ నుండి నాగ్‌పూర్ రామ్‌నగర్‌లోని భగవత్పాద సభలో త్రికాల పూజలు నిర్వహించారు. అక్కడ బస చేసిన సందర్భంగా ఆయన భక్తులకు దర్శనం, తీర్థప్రసాదాలు అందజేసి అనుగ్రహభాషణం చేశారు.






డిసెంబర్ 2వ తేదీ ఉదయం, భగవత్పాద పాదుకా ప్రతిష్ఠా వజ్ర మహోత్సవం, తిరువిడైమరుదూర్ కార్యక్రమానికి స్వామివారు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. 4వ తేదీన కార్తీక సోమవారం నాడు ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించడం జరిగింది. 9వ తేదీన పూజ్య శ్రీ స్వామివారు సంత్ కృపా హౌస్ సందర్శించడం జరిగింది. భక్తులు స్వామివారికి పాదపూజలు చేసుకున్నారు.





డిసెంబర్ 12వ తేదీ పూజ్యశ్రీ స్వామివారు నిజామాబాద్‌లోని ఉత్తర తిరుపతిగా ప్రసిద్ధి చెందిన శ్రీ వెంకటేశ్వరస్వామి మందిరం, దత్త పీఠం, వద్దకు రాత్రి 9 గంటలకు చేరుకున్నారు. స్వామివారికి ఆశ్రమ నిర్వాహకులు మరియు భక్తులు స్వాగతం పలికారు. స్వామివారు శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం, ఆలయంలోని ఇతర మందిరాలను దర్శించుకున్నారు. భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. ఆలయాన్ని నిర్వాహకులు దీపాలతో అందంగా అలంకరించారు. డిసెంబర్ 15వ తేదీ నుండి ధనుర్మాస పూజలను నిర్వహించడానికి శ్రీస్వామివారు హైదరాబాద్‌లోని పద్మారావునగర్‌లో ఉన్న స్కందగిరిదేవాలయానికి చేరుకున్నారు.





**డిసెంబర్ 18వ తేదీ** స్కందషష్ఠి సందర్భంగా స్కందగిరి శ్రీసుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో ఏకాదశరుద్రాభిషేకం, సహస్రనామపూజ జరిగింది. స్వామివారు సుబ్రహ్మణ్యస్వామి దర్శనం చేసుకొని, భక్తులకు సుబ్రహ్మణ్యస్వామివారి మహాత్మ్యం తెలియజేశారు.






**డిసెంబర్ 23వ తేదీ** పూజ్యశ్రీ స్వామివారు స్కందగిరిలోని వేంకటేశ్వరస్వామి దేవాలయము మరియు మల్కాజ్ గిరి, ఆనంద్ బాగ్ లోని వేంకటేశ్వరస్వామి దేవాలయములలో జరిగే రెండవ వార్షిక సామూహిక విష్ణు సహస్రనామపారాయణ కార్యక్రమాన్ని సందర్శించి, భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణం చేసి, ఆశీర్వదించారు.




డిసెంబర్ 22వ తేదీ పూజ్య శ్రీ స్వామివారు సికింద్రాబాద్ లోని రాష్ట్రపతి నిలయంలో భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపదిముర్ముగారిని కలిసి వారికి అమ్మవారి ప్రసాదాన్ని అందిజేశారు. భారతదేశం శాంతి, శ్రేయస్సు, అభివృద్ధి మార్గంలో ముందుకు వెళ్ళడానికి వారి దివ్య ఆశీస్సులను, శుభాకాంక్షలను తెలియజేశారు. రాష్ట్రపతి నిలయంలోని భవానీ ఆలయాన్ని సందర్శించారు.





డిసెంబర్ 27వ తేదీ ఆరుద్రనక్షత్ర పర్వదినం సందర్భంగా శ్రీమహాత్రిపురసుందరీ సమేత చంద్రమౌళీశ్వరస్వామికి విశేషంగా ఏకాదశి రుద్రాభిషేకం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. అనంతరం సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో శ్రీశివగామ అంబాల్ సమేత నటరాజస్వామికి జరిగిన విశేషపూజలను శ్రీస్వామివారి సందర్శించుకున్నారు.







**జనవరి 1వ తేదీ 2024** ఆంగ్లనూతన సంవత్సరం రోజున శ్రీ వి. ఎస్. రామచంద్రమూర్తిగారు రచించిన 'శ్రీ శంకర భారతి' పుస్తకావిష్కరణ జరిగింది. పుస్తకాన్ని శ్రీ స్వామివారు ఆవిష్కరించి వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు అందించారు.





**జనవరి 2వ తేదీ** స్కందగిరి దేవాలయములో పూజ్యశ్రీ స్వామివారి సమక్షములో వారి ఆశీస్సులతో ఈ నెల 8వ తేదీ శ్రీమహాస్వామివారి ఆరాధన సందర్భంగా వారం రోజులపాటు జరిగే ఋగ్వేద పారాయణము ప్రారంభమై 8వ తేదీ వరకు భక్తిశ్రద్ధలతో జరిగింది.






జనవరి 4వ తేదీన 'కాలడి నుండి కామకోటి' అనే పుస్తకాన్ని స్కందగిరి దేవాలయం ఆవరణలో శ్రీ స్వామివారు ఆవిష్కరించారు.




జనవరి 5వ తేదీన స్కందగిరి శ్రీసుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో శ్రీస్వామివారి సమక్షంలో వేదసదస్సులు జరిగాయి. సదస్సులో పాల్గొన్న వేదపండితులను స్వామివారు ఆశీర్వదించారు.

# శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్రసరస్వతీ మహాస్వామివారి 30వ ఆరాధనా మహోత్సవం 8 జనవరి 2024



శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామివారి 30వ ఆరాధన మహోత్సవం కాంచీపురం మరియు స్కందగిరిలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా జనవరి 2 నుండి జనవరి 8 వరకు ఋగ్వేద సంహితా పారాయణ జరిగింది. వేద మంత్రాల ధ్వనితో శ్రీ శంకర మఠం కలకలలాడింది. జనవరి 8న స్కందగిరిలో ఏకాదశ రుద్ర జపం మరియు హోమాలు, శ్రీ త్యాగరాజ స్వామివారి పంచరత్న కీర్తనల సంగీతాంజలి మరియు తీర్థ నారాయణ పూజలు జరిపించారు. పూజానంతరం స్వామివారు భక్తులందరికి అనుగ్రహభాషణానంతరం అక్షత ఆశీర్వాదాలు ఇచ్చి అనుగ్రహించారు. ఎడనీర్ మఠం పీఠాధిపతి శ్రీ సచ్చిదానంద స్వామివారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





మహాస్వామివారి ఆరాధన సందర్భంగా స్కందగిరిలోని శ్రీమఠం శిబిరం నుండి కౌతా కల్యాణ మండపం వరకు రథోత్సవం నిర్వహించారు. వేద మంత్రోచ్చారణలు, సంప్రదాయ నృత్యాలు, సాంప్రదాయ పాఠశాల విద్యార్థినుల కోలాటం మరియు భజనలు, ప్లకార్డులపై మహాస్వామివారి సందేశాలను ప్రదర్శించారు. కౌతా కల్యాణమండపం వేదిక వద్ద విష్ణుసహస్రనామం చేశారు. గౌరవనీయులు శ్రీ హిందూ గణేశన్ రచించిన 'శ్రీ కంచి కామకోటిపీఠం శంకరాచార్య స్వామివార్లతో నా అనుభవాలు' అనే పుస్తకాన్ని శ్రీస్వామివారు ఆశీర్వదించి విడుదల చేశారు. విద్వాంసుడు శ్రీ దేవదత్త పాటిల్‌కు 'శాస్త్ర సుధాకర' బిరుదు ప్రదానం చేశారు. స్వామివారు అగ్నిహోత్రానికి సంబంధించిన వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. అనుగ్రహ భాషణంతో సభను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమం కామకోటి టివిలో ప్రత్యక్ష ప్రసారం చేయబడింది. కాంచీపురంలో మహాస్వామి వారి అధిష్ఠానం వద్ద కూడా అభిషేకం, సంప్రదాయ భజనలు, గోష్ఠీ గానం, పూర్ణాహుతి, దీపారాధన తదితర కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.












SRI KANCHI KAMAKOTI
SANKARA MANDIR
SRI HANUMAN MANDIR
SKANDAGIRI, SECUNDERABAD - 500 061













కాంచీపురంలో పూజ్యశ్రీ మహాస్వామివారికి ఆరాధన మహోత్సవ కార్యక్రమంలో రాజవీధుల చుట్టూ స్వర్ణ రథోత్సవం నిర్వహించారు. మాండొలిన్ శ్రీ యు రాజేష్ మరియు బృందం 8వ తేదీ సాయంత్రం శ్రీమఠంలో నాద-సమర్పణాన్ని అందించారు.



జనవరి 10వ తేదీ శ్రీ స్వామివారి సమక్షం వేద శాస్త్ర సభ జరిగింది. స్వామివారి వేదపండితులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమం కామకోటి టివిలో ప్రత్యక్షప్రసారం చేయబడింది.



# మూకపంచశతి ఆర్యాశతకం

- బాలాత్రిపురసుందరి చిర్రావూరి

**శ్లో॥** సంశ్రితకాంచీదేశే సరసిజదౌర్భాగ్యజాగ్రదుత్తంసే ।
సంవిన్మయే విలీయే సారస్వతపురుషకారసామ్రాజ్యే ॥ 25 ॥

**తాత్పర్యం :-** కాంచీపురముయందు నెలకొనియున్న, కమలములదౌర్భాగ్యసమయమునందు మేల్కొనువాడైన చంద్రుని శిరోభూషణముగా గల, జ్ఞానస్వరూపమైన, సారస్వతప్రయత్నసామ్రాజ్యముయందు (అమ్మవారి యందు) లీనమగుచున్నాను.

**బాలమనోజ్ఞా :-** సరసిజదౌర్భాగ్యజాగ్రదుత్తంసే – సూర్యుడు ఉండగా కమలములు ముకుళించుకుని ఉంటాయి. అనగా వాటికి సూర్యకాంతి దౌర్భాగ్యాన్ని కలిగించేది. ఆ దౌర్భాగ్యాన్ని పోగొడుతూ తను మేల్కొనటంతో వాటికి సౌభాగ్యాన్ని ఇచ్చేవాడు చంద్రుడు. అట్టి చంద్రుని శిరోభూషణముగా కలిగినటువంటిది ఆ తల్లి అని అర్థం. కవులవాక్కులను కమలాలతో పోలుస్తూ ఆ వాక్కులకు మూలమేమంటే ఆ తల్లి యొక్క కాంతి దర్శనమే. అమ్మవారి దర్శనానికి మునుపు ఆవిడ శిరోభూషణమైన చంద్రుని కాంతి మన మీదకు ప్రసరిస్తుంది. అని అంతరార్థంగా చెప్తూ ఆ కాంతి కవుల మీద పడటంతోనే కవిత్వమనే కమలాలు వికసిస్తున్నాయని అంటూ జ్ఞానస్వరూపముగా అమ్మని చెప్తున్నారు. జ్ఞానమునకు స్త్రీపుంనపుసకభేదం లేదు. ఆవిడను పరబ్రహ్మగా చెప్తున్నారు. సారస్వతపురుషకారసామ్రాజ్యే – సరస్వతికి సంబంధించిన (బ్రాహ్మీ తు భారతీ భాషా గీరవాగ్వాణీ సరస్వతీ అని అమరకోశం. సరస్వతి అంటే వాక్కు అని అర్థం) పురుషకారమంటే పౌరుషమని. అనగా ప్రయత్నం. వాక్కులయొక్క ప్రయత్నాలకు సామ్రాజ్యము అనగా సంపూర్ణత కలిగినటువంటి ఆ తల్లియందు లీనమౌతున్నాను! అని మూకకవి అంటున్నారు. "వాగర్థావివ సంపృక్తౌ..." అని కాళిదాసు వాక్కు అనగా శబ్దస్వరూపమే ఆ తల్లి అని వర్ణించాడు. వాక్కు నాలుగువిధాలుగా ఉంటుందని వశిన్యాది వాగ్దేవతలు" పరా

ప్రత్యక్చితీ రూపా పశ్యన్తీ పరదేవతా. మధ్యమా వైఖరీరూపా భక్తమానసహంసికా.... “ అని స్తుతించారు. అటువంటి ఆ తల్లియందు నా మనస్సు లీనమైనది కాబట్టే ఈ వాక్కులు వస్తున్నాయి తప్ప నాది ఏమీ లేదని భావం.

**శ్లో॥ మోదితమధుకరవిశిఖం స్వాదిమసముదాయసారకోదండమ్ ।**
**ఆదృతకాంచీఖేలనమాదిమమారుణ్యభేదమాకలయే ॥ 26 ॥**

**తాత్పర్యం :-** తుమ్మెదలకు సంతోషాన్ని కలుగజేసే పూలబాణములు కలిగిన,తీయదనముల సముదాయసారము అనగా చెరకును విల్లుగా కలిగిన, క్చాపురముయందు ఆడుకొనుచున్న మొదటిదైన ఎరుపును ధ్యానించెదను.

**బాలమనోజ్ఞా :-** అరవిందమశోకం చ చూతం చ నవమల్లికా. నీలోత్పలం చ పృతే పృబాణస్య సాయకాః.” అని అమరకోశం. అమ్మవారు ఈ ఐదు బాణాలను ధరించి ఉన్నారట. ఈ ఐదు కూడా చిన్నపాటి ఎరుపుదనాన్ని కలిగి ఉంటాయి. అలాగే తియ్యదనాల సారమంతా కూడా చెరకులోనే ఉంటుంది. ఆ చెరకువిల్లు కూడా కొంచెం ఎరుపుదనాన్ని కలిగి ఉంటుంది. ఇంకా ఆవిడే అరుణ.” అరుణాం కరుణాత్తతాక్షీం....” అని అమ్మవారిని అరుణిమ వర్ణంతో భావిస్తారు. ఉదయిస్తున్న సూర్యుని వర్ణం కూడా ఎరుపే. “ఉద్యద్భాను సహస్రాభా” ఆ తల్లి. అలాగే సత్వరజస్తమోగుణాలలో రజోగుణము యొక్క వర్ణం ఎరుపు. ఈ గుణాలనుండే వర్ణాలనేవి ఏర్పడ్డాయి. అరుణస్య భావః ఆరుణ్యం. రజోగుణము యొక్క ప్రభావం వలననే సృష్టి ఏర్పడుతోంది. ప్రాణులు ఈ మూలప్రకృతి నుండే ఉద్భవిస్తున్నాయి. అటువంటి ఆరుణ్యభేదమైన మూలప్రకృతిని నేను ధ్యానిస్తానని మూకమహాకవి అమ్మవారిని వర్ణిస్తున్నారు.

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA


SRI CHANDRAMOULEESWARAYA NAMAHA

**SRI KANCHI KAMAKOTI PEETAM**

**Jagadguru Shankaracharya Swamigal**

**Shrimatam Samsthanam, Kanchipuram**





# Vijaya Yatra

of

## Jagadguru Pujyashri Shankara Vijayendra Saraswathi Shankaracharya Swamigal


### Programme - Updated upto 12th February 2024

| DATE | PLACE | PLACE OF PUJA | Notes |
|---|---|---|---|
| Upto 31st Jan. 2024 | Secunderabad | Sri Shankar Math - Hanuman Mandir, Skandagiri, Secunderabad | On 31st Jan 2024<br>11:30 AM Yellamma Pochamma Temple Kumbhabhishekam<br><br>1.30-4.30 pm<br>Visit to Dundigal Mahavidyapeetam, followed by Dep. to Zaheerabad |
| 1st Feb. 2024 | Zaheerabad | Sri Siddhi Vinayak Swamy Devasthanam, Zaheerabad, Sangareddy Dist, Telangana | |
| 2nd-4th Feb. 2024 | Solapur | 'Ramanjali'<br>30/69, Padma Nagar, Near Karnik Nagar, Solapur, Maharashtra | 2/2/2024- Shukra Vara Puja<br><br>3/2/2024 - Eve Darshan & Pravachan at Venkateshwara Swamy Mandir<br>Contact Yogesh Mykal +91 94220 66156 |
| 5th - 12th Feb. 2024 | Pune | Sri Shankar Math, Veer Savarkar Marg, Sarasbaug, Pune, Maharashtra | 5th morning -<br>7.30 am - Shreemant Dagdushet Halwai Ganpati Mandir, Pune<br>Then in procession to Shankar Math, Veer Savarkar Marg, Sarasbaug, Pune<br><br>Contact<br>Sri Shankar Math<br>Sri Ramachandran, Manager:<br>+91 84468 27343 |

Visit www.kamakoti.org and Kamakoti.tv for updates &
www.kanchimuttseva.org to contribute online

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

# శ్రీ కామకోటివాణి
## ప్రత్యేక సంచిక



వెల - 250 రూపాయలు
(Postage 50 రూపాయలు అదనం)

ప్రత్యేక సంచిక కోసము
సంప్రదించవలసిన వివరాలు:

**శ్రీ కంచి కామకోటి క్యాంపు**

Email ID - srikamakotivaani@gmail.com



## For Sri Kamakoti Vaani Subscription



### Bank Details:

**Account Name:**
Sri Kamakoti Touryatrika Trust SKV
Bank: ICICI Bank
Account No.: 440705000345
IFSC Code: ICIC0004407
UPI ID – SRIKAMAKOTIVAANI@icici

### Subscription

₹ 480 INR (India)
₹ 5000 INR
(Lifetime, for 10 years)

e-mail id -
srikamakotivaani@gmail.com

Scan me!

Sri Kamakoti Vaani subscription payment gateway.

Donors may please contact:
**Prayaga Srinivas : 800 800 1335**

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA

SRI CHANDRAMOULEESWARAYA NAMAHA



SHRI KANCHI KAMAKOTI PEETAM
JAGADGURU SHANKARACHARYA SWAMIGAL
SHRIMATAM SAMSTHANAM
1, SALAI STREET, KANCHIPURAM, TAMILNADU - 631502 INDIA

www.kamakoti.org

fb.me/srikamakoti

youtube.com/kanchimath

twitter.com/kanchimatham

instagram.com/kanchimutt


Koo

koo @kamakoti

www.kamakoti.tv

www.kanchimuttseva.org
ESEVA PORTAL
for Online Puja Bookings &
Contributions

JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA JAYA JAYA SHANKARA HARA HARA SHANKARA


రాకాచంద్రసమానకాంతివదనా నాకాధిరాజస్తుతా
మూకానామపి కుర్వతీ సురధునీనీకాశవాగ్వైభవమ్ ।
శ్రీకాంచీనగరీవిహారరసికా శోకాపహంత్రీ సతామ్
ఏకా పుణ్యపరంపరా పశుపతేరాకారిణీ రాజతే ॥